# తెలుగు జాతి అస్తిత్వం - మాతృభాషే!

జాతి మనుగడ ఒక ప్రశ్నార్థకమైనప్పుడు,
అది భాషలో ఇమిడిన తత్వమై కనిపిస్తుంది.
తెలుగు జాతి అస్తిత్వం అనేది
ఖచ్చితంగా మాతృభాష పైనే ముడిపడి ఉంది.
నదీ ప్రవాహం లాంటిది భాషా పుట్టుక,
కులమత ప్రాంతాలకు అది అతీతం.
నాగరికతకు జీవనాడిలా నిలుస్తూ
జాతిని ఏకం చేసేది ఒక్క భాషే!
మనం ఎవరమో చెప్పుకోవడానికి
సరైన చిరునామా చూపింది మన భాష.
సాంప్రదాయ సంస్కృతులకు జీవం పోస్తూ
మన ఆనవాళ్లను ప్రపంచానికి చాటింది.
ఊహలకు రూపాన్ని కల్పిస్తూ,
వ్యక్తిత్వానికి బాటలు వేస్తూ,
నిన్ను ప్రపంచానికి పరిచయం చేసి
నీకు సమగ్ర రూపాన్ని ఇచ్చింది ఈ భాషే.
మాతృభాష మరుగున పడిందా..
మన అస్తిత్వాన్ని కోల్పోయినట్లే!
తెలుగు జాతి ఉనికి దిగజారి,
పరభాషా వ్యామోహంలో మునిగిపోయినట్లే.
చాప కింద నీరులా ప్రవేశించే పరభాష,
మాతృభాషను మెల్లగా మింగేస్తోంది.
నదీ ప్రవాహానికి అడ్డుకట్టలు వేస్తూ
త్రిలింగ భాషా సౌందర్యాన్ని హరిస్తోంది.
మొక్క సహజంగానే ఎదగాలి,
పిల్లలు మాతృభాషలోనే వృద్ధి చెందాలి.
కృత్రిమత్వం ఉంటే మానసిక వికాసం
కుంటుపడుతుంది,
అప్పుడు పరిపూర్ణ జ్ఞానాన్ని సంపాదించలేం.
మాతృభాషపై పట్టు వస్తే,
ఎన్ని భాషలనైనా సులువుగా నేర్వవచ్చు.
మానసిక వికాసం భాషతోనే సాధ్యం,
సహజత్వానికి మాతృభాషే పునాది.
ఆలోచనలకు, ఆశలకు, ఊహలకు రూపం..
మాతృభాషలోనే దాగి ఉంది సృజనాత్మకత.
భావాల వెలుగును పంచుతూ
చీకట్లను తొలగించేది ఒక్క మాతృభాషే.
ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు
భాషా శక్తితోనే సాధ్యమవుతున్నాయి.
మన భాషలోని బలమే
మన పిల్లల ఎదుగుదలకు మూలం.
ఎన్ని భాషలు అభ్యసించినా,



ఆంగ్లాన్ని అభివృద్ధికి వాడుకున్నా..
మాతృభాషను మాత్రం మరవద్దు,
దాన్ని తరతరాలకు అందించడమే మన కర్తవ్యం!

- కొప్పుల ప్రసాద్
నంద్యాల
9885066235

# కవితా శీర్షిక : మాతృభాష మాధుర్యం

అమ్మ ఒడే
తొలి బడి అందరికి
అమ్మే ఆదిగురువు అందరికి!
పుట్టుకతో పలికే తొలి పలుకు అమ్మా యని...
ఆ పలుకే తేనీయలోలుకు తెలుగు పలుకు!
పుట్టుకతో ఆవు పలుకు అంభా యని...
కోయిల పలుకు కుహు కుహు యని...
కాకి అరుచును కావ్ కావ్ మని...
కోడి మేల్కొల్పు కొక్కోరోకో యని...
ఇలా పశుపక్ష్యాదులు సైతం...
తల్లిభాషలో సంభాషిస్తుంటే...
మేధోసంపత్తి కల్గిన మనిషి మాత్రం...
పరాయిభాషలో సంభాషించడం భావ్యమా!?
పండు వెన్నెల్లో ఆరుబయట విహరించినట్లు...
మండు వేసవిలో చల్లని పానీయం సేవించినట్లు...
చిరుజల్లుల సమయంలో ఇంద్రధనుస్సు
అవతరించినట్లు...
ఆహ్లాద సమయంలో నెమలి పురివిప్పి
నాట్యమాడినట్లు...
మాతృభాషలో పఠిస్తే సంపూర్ణ
విజ్ఞానోదయమగునట్లు!
అందుకే ఓ తెలుగోడా!
మాతృభూమిని ప్రేమిస్తూ...
మాతృమూర్తిని సేవిస్తూ...
మాతృభాషలోనే పఠిస్తూ...
మాతృభాషలోనే భాషిస్తూ...
మాతృభాష మాధుర్యాన్ని చవిచూస్తూ...
మాతృభాషాభిమానివై కదులు!
మంచిమనిషిగా మిగులు!!!

- రచన :
సాహితిబంధువు : డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)



కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్
తెనాలి, గుంటూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము
చరవాణి : 7416638823




# విధాత సినిమాను ఆదరించండి

## -: మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 20 : తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ అధ్యక్షుడు, విశ్వకర్మ ముద్దుబిడ్డ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి చిత్ర నిర్మాతగా తీసిన సినిమా విధాత ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ పలు పోరాటాల రూపంలో విధాత అడుగు పెడతాడు. తప్పు చేసిన వారిని శిక్షిస్తాడు. పేదవారి పక్షాన, బలహీనవర్గాల పక్షాన నిలబడతాడు. అలాంటి గొప్ప సినిమా విధాత అని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ కొమురయ్య అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో విధాత సినిమా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించబడి ప్రేక్షకుల్లో స్ఫూర్తి నింపేలా ఉంటుందని ఇలాంటి చిన్న చిత్రాలకు తెలుగు రాష్ట్రల ప్రభుత్వాలు కూడా సహకారం అందించాలని, ఈ సినిమా త్వరలోనే థియేటర్లలో విడుదల కానుందన్నారు. ఈ చిత్రాన్ని చూసి, ఆదరించి విజయవంతం చేయాలని, వారికి మీడియా మిత్రులు, ప్రేక్షకులు సపోర్ట్ చేయాలని, చిత్ర యూనిట్ కి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో
మున్సిపల్ వైస్ ఛైర్మన్ చిత్తారి పద్మ రవీందర్,
సింగిల్ విండో మాజీ చైర్మన్ బొలిశెట్టి శివయ్య.
కౌన్సిలర్లు వాల సుప్రజ, గాదపాక రవీందర్, స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పందిళ్ళ శంకర్,
తెలుగు వెలుగు సాహితీ వేదిక అధ్యక్షుడు పోలోజు రాజ్ కుమార్,
బహుముఖ కళాకారులు నాదమునుల రామారావు, గాయకులు చిట్టి దేవేందర్ రెడ్డి, రచయిత వేముల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నువ్వు నేను మాత్రమే



నీ కోసం నిన్నే వదులుకునేంత ప్రేమ నాలో ఉంది
నా కోసం వచ్చేంత ప్రేమ నీకు ఉందా...!!!

ఉందంటే చెప్పు ఈ క్షణమే ఈ ప్రపంచాన్ని వదిలేసి జంట పక్షులమై కొత్త గూటి కోసం ఎగిరిపోదాం...

వలస పక్షులమై అక్కడక్కడ సేద తీరుతూ గమ్యానికై పయనం కొనసాగిద్దాం...


పరిస్థితులు ఏవైనా పట్టించుకోవద్దు
కేవలం కావాల్సింది ఒకరికి ఒకరం
నువ్వు నేను
ఈ లోకం మనకొద్దు
నువ్వు నేను మాత్రమే
మనుషులేవ్వరు మనకొద్దు
నువ్వు నేను మాత్రమే
బంధాల సంకెళ్ళు తొలగించి వెళ్లిపోదాం
మనకు కావాల్సింది ప్రేమ మాత్రమే....

తిండి దాహం నిద్ర ఏది గుర్తు రావొద్దు
ప్రేమలో ఉండాల్సింది కేవలం
నువ్వు నేను మాత్రమే....

మన కళ్ళు ముసుకుపోవాలి
ప్రేమలో తేలిపోవాలి
చీకటి ప్రపంచంలో కొత్త వెలుగులకై ఇద్దరం వెతుక్కోవాలి
అమ్మ నాన్న అక్క చెల్లి అన్న తమ్ముడు
ఏ బంధాలు మనకొద్దు
కేవలం నువ్వు నేను....

అర్థం అవుతుందా
నీ కోసం నిన్ను వదులుకోడానికి నేను సిద్ధం
నా కోసం నువ్వొస్తావా....!!!

**- రచన : పోలగాని భాను తేజశ్రీ**






# శీర్షిక : ఎందుకనో?

నా చేతులకు బిగించిన గొలుసులు
నేనే కట్టుకున్నవని తెలుసు
కానీ! వాటిని తెంచుకోలేను ఎందుకనో?
నా నోటిలో ఉన్న మాటలు
సత్యమైనవని తెలుసు
కానీ! భయంతో మూసుకుపోతున్ని ఎందుకనో?

మంత్రాలు చదివినా, పుస్తకాలు తిరిగేసినా
ఆత్మవిశ్వాసం లభించదని తెలియదు ఎందుకనో?
ఎదుటివాడి మాటల్లో ఒక్క మాట
జీవితాన్ని మార్చేస్తుందని నమ్ముతున్నాను ఎందుకనో?

లంచం తప్పు అని తెలిసినా
చేతిలో డబ్బు పట్టుకుని నిలబడతాను
"ఇదొక్కసారి" అని సమాధానం చెప్పుకుంటాను
కానీ! ఆ "ఒక్కసారి" ఎప్పుడూ ఆగదు ఎందుకనో?

నా దేశం నాకు ఇచ్చినది
చదువు, ఆలోచన, స్వేచ్ఛ అనుకున్నాను
కానీ! నిజంగా ఇచ్చింది
భయం, లొంగుబాటు, సౌకర్యవాదం
ఇవేనా నా వారసత్వం?

ఇప్పుడు ఈ ప్రశ్నలు నన్ను కుదిపేస్తున్నాయి
ఎందుకనో అని అడగడం మానేసి
"ఇక ఎందుకు కాదు?" అని
అడగాల్సిన సమయం వచ్చేసింది కదా...

అయినా, ఈ రాత్రి కూడా
అదే పాత గొలుసులతో
నిద్రపోతున్నాను ఎందుకనో?.

- మీ.. రాము కోలా, దెందుకూరు
ఖమ్మం
9849001201.

# శీర్షిక : ప్రేమదీపం




వ రా

మా అమ్మకు వంటగదే
అత్యంత ప్రీతిపాత్రమైన స్థానం
పొగ్గొట్టమే తన తొలి నేస్తం
గరిటెపట్టి వండితే అన్నపు మెతుకులు
పూలరాశిలా సంబరపడతాయి

ఏనాడు పుస్తకాల ముఖం చూడకున్నా
మనుషుల మనస్తత్వాలను
చదివిన మనిషిగా జీవితంలో
లోకజ్ఞానమెరిగి బతకడం నేర్చింది

ఇష్టాలనే తన ఇష్టాలుగా
మార్చుకుని ప్రేమదీపమై
మా ఇంట వెలుగును పంచి
మా బతుకుల్లో సంతోషానికి అర్థం తానై నిలిచింది

పచ్చకాగితాల కోసం
ప్రాకులాడే స్వార్థం మధ్య
ఉన్నంతలో పంచుకుని తినే గుణాన్ని
అలవర్చుకున్నా అన్నపూర్ణగా
తన పేరును సార్థకం చేసుకుంది



పారబట్టిన మట్టి చేతులతో శ్రమించి
అక్షరాన్ని భిక్షగా ప్రసాదించి
కలాన్ని కానుకగా అందించి
మా వెన్నంట ధైర్యమై నిలబడింది

త్యాగానికి తెగింపుకు ముందుండే
అమ్మకు మేమెన్నటికీ తన ఒడిలో
ఒదిగిపోయే చంటిబిడ్డలమే
రుణం తీర్చలేని ఆ హృదయ ప్రేమకు
ఆద్యంతం కట్టు బానిసలమే!

- ఎం.రాజశేఖర్,
ఆదోని 9381004519

